ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
సోమవారం 3 మార్చి 2025



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సోమవారం సా.. 6.28 గం॥
సహార్ : మంగళవారం ఉ..5.10 గం॥



ఇతడి పేరు బత్తుల సత్యం. ఉపాధ్యాయుడిగా రిటైర్డ్ అయి వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లో ఉంటున్నాడు. ఆదివారం ఉదయం తను కిరాణ సరుకులు తీసుకొని ఇంటికి వస్తుండగా, కోతుల గుంపు ఒక్కసారిగా మీదపడింది. దీంతో తను కిందపడిపోగా కోతులు మూకుమ్మడిగా దాడి చేశాయి. చేతులు, కాళ్లపై రక్కాయి. స్థానికులు వాటిని కర్రలతో బెదిరించడంతో పారిపోయాయి. అనంతరం సత్యంను 108లో ఎంజీఎంకు తరలించారు.

- ఖిలా వరంగల్, ఆంధ్రజ్యోతి



వరంగల్ శివనగర్‌లో కోతుల గుంపు

కోతుల పంచాయతీ!

- ఇళ్లు, పంటలను పీకి పందిరి వేస్తున్న వైనం
- దాడులతో బెంబేలెత్తుతున్న ప్రజలు
- అడవుల్లో అటకెక్కిన మంకీ ఫుడ్ కోర్టులు
- ఆహారం కోసం ఊళ్లలోకి రాక
- కానరాని సంతాన నియంత్రణ ఆపరేషన్లు
- మంకీ రెస్క్యూ రిహాబిలేషన్ సెంటర్ ఏర్పాటుకు డిమాండ్
- 'స్థానిక' ఎన్నికల్లో కోతుల అంశమే ప్రధాన ఎజెండా

పల్లెల్లో తీవ్రమైన వానరాల సంచారం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

అడవుల్లో ఉండాల్సిన వానరాలు.. జనావాసాల్లో తిష్ట వేశాయి. కోతి చేష్టలతో ప్రజలకు చిరాకు తెప్పిస్తున్నాయి. మందలకు మందలుగా పల్లె, పట్టణాలను ఆక్రమించుకుంటున్నాయి. ఇంటి కప్పులే కాదు.. పంట పొలాలను పీకి పందిరేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి చేతికి ఏది దొరికితే అది లాక్కెళుతున్నాయి. అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే దాడులు చేసి గాయ పరుస్తున్నాయి. ఇక కోతుల నుంచి పంటలను కాపాడుకునే క్రమంలో అన్నదాతలు తన ప్రాణాలు కోల్పోతున్నారు. వందలాది మంది గాయాలతో అస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కోతులకు సంతాన ఉత్పత్తి నియంత్రణ ఆపరేషన్లు లేకపోవటంతో వాటి సంతతి రోజు రోజుకు పెరిగిపోతుంది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వానర బాధితులు లేని ఊరే లేదంటే అతిశయోక్తి కాదు. ఈ వానర కష్టాలను తరిమి వేసేందుకు పంచాయతీల్లో నిధులు కరువయ్యాయి. దీంతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 'కోతుల పంచాయతీ' ప్రధాన ఎజెండా మారనుందన్న చర్చ జరుగుతోంది.

ఊళ్లు.. పంటలపై వానర సైన్యం

కోతుల బీభత్సంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్లనే కాదు పంటలను కూడా ధ్వంసం చేస్తుండటంతో.. రైతులు పొలాల వద్దకు వెళ్లాలంటేనే వణికిపోతున్నారు. గుంపులు గుంపులుగా సంచరిస్తూ వ్యవసాయ పనులకు వెళ్లే వారిని, ఇతర పనులకు బయటకు వచ్చే వారి వెంటపడి గాయపరుస్తున్నాయి. దీంతో రైతులు, కూలీలు రోజువారి పనులకు వెళ్లేవారు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. కోతుల దాడుల్లో గాయాలకు గురైన వారు మూడు రోజులకు ఒకసారి టీకాలు తీసుకునేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల చుట్టూ తిరుగడంతో పాటు.. భుజాలు, ఒళ్లు నొప్పులు, వాపులతో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ప్రతీ గ్రామంలో ఈ పరిస్థితి ఉంది. కోతుల బెడద వలన చాలా వరకు కూరగాయలు, మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేయటం లేదు. ఇక ఊళ్లల్లో ఇంటిని పీకి పందిరి వేస్తున్నాయి. చిన్నపిల్లలతో కలిసి బయటకు వెళ్లాలంటే వణికిపోతున్నారు. కిరాణం షాపు నిర్వహకులు ఇనుప గ్రిల్ ఏర్పాటు చేసుకుని సరుకులు విక్రయించుకోవాల్సి వస్తోంది. కోతుల సమస్య ఏ ఒక్క ఊరుకో కాకుండా రాష్ట్రం మొత్తం వానర బీభత్సంతో జనం బెంబేలెత్తిపోతున్నారు.

మంకీ ఫుడ్‌కోర్టులు జాడేదీ?

అడవులు పోడు కారణంగా అంతరించిపోతున్నాయి. దండకారణ్యంలో సైతం కలప కోసం స్మగ్లర్లు భారీ వృక్షాలను నేలమట్టం చేస్తున్నారు. దీంతో అడవుల్లో తినేందుకు కోతులకు ఆహారం కొరత ఏర్పడుతోంది. ఊళ్లల్లో తిష్టవేసిన వానర సైన్యాన్ని బంధించి అడవుల్లో వదిలేసినా.. అవి తిరిగి ఊళ్లలోకే వస్తున్నాయి. దీనికి తోడు కోతుల సంతానం భారీగా పెరుగుతుండటంతో వాటికి కావల్సినంత పండ్లు అడవుల్లో దొరకటం లేదు. దీంతో కపిరాజులు జనావాసాలకే జై కొడుతున్నాయి. ఈ క్రమంలో గత ప్రభుత్వం 2020 సంవత్సరంలో మంకీ ఫుడ్ కోర్టులను ఓరుగల్లులోని అన్ని జిల్లాలో ఏర్పాటు చేసింది. అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ ఫుడ్ కోర్టుల్లో అరటి, పనస, సంత్రా, జామ, దానిమ్మ, రేగు తదితర పండ్ల మొక్కలను పెంచారు. అయితే కొన్నాళ్లకే వాటి నిర్వహణ మరిచారు. ఫలితంగా చాలా ప్రాంతాల్లో మంకీ ఫుడ్ కోర్టులు లేకుండా పోయాయి. దీంతో కోతులు ఆహారం కోసం మళ్లీ ఊళ్లలోకి వస్తున్నాయి. వాటి ఆహారం కోసం మనుషులపై దాడులకు కూడా వెనుకాడటం లేదు. కోతి చేష్టలతో ప్రజలను పరుగులు పెట్టిస్తున్నాయి.

కరువైన నియంత్రణ!

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 5 లక్షలకుపైగా కోతులు ఉన్నట్లుగా

మిగతా 7వ పేజీలో...



నేడు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

- నల్గొండ జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు
- అర్ధరాత్రి తేలనున్న విజేత
- జయాపజయాల్లో ఓరుగల్లు ఓట్లే కీలకం

7

నల్గొండలోని స్టేట్ వేర్‌హౌస్ గోదాములో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం





సంగీత విభావరిలో పాప్ సింగర్ నిఖిల్ డిసౌజ

ఆకట్టుకున్న ఫ్యాషన్‌పరేడ్.. అలరించిన డీజే

ముగిసిన స్ప్రింగ్ స్ప్రీ

- తిరుగు ముఖం పట్టిన విద్యార్థులు
- మధురానుభూతులను మిగిల్చిన వసంతోత్సవం
- చివరి రోజు కొనసాగిన పలు ఈవెంట్లు
- నాటకానికి కొత్త అంకం దిద్దిన నుక్కడ్
- టీం స్పిరిట్‌తో విజయవంతం

7

ఘనంగా శ్రీపాదరావు జయంతి



శ్రీపాదరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి వేడుకలు కలెక్టరేట్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి కలెక్టర్ రాహుల్‌శర్మ పూలమాల వేసి నివాళి అర్పించారు. శ్రీపాదరావు సేవలు నేటి సమాజానికి ఆదర్శమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. సమాజంలో మార్పు తీసుకొచ్చేందుకు శ్రీపాదరావు ఎంతో కృషిచేశారన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అండ్ యూత్ అధికారి రఘు, డీఎల్పీవో భద్రయ్య, హౌసింగ్ ఏఈ రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

మరింత వేగంగా సేవలు



శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీస్ యంత్రాంగం సమర్థంగా పని చేస్తోంది. జిల్లాకు ప్రధానంగా నాలుగు పోలీస్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వ ఆదేశాలు రాగానే నిర్మాణాలు ప్రారంభమవుతాయి. ప్రస్తుతం అన్ని ఠాణాల్లో సరిపడా సిబ్బంది ఉన్నారు. కొత్తగా ఏర్పడే వాటితో సిబ్బంది సంఖ్య సైతం పెరగనుంది.

- కిరణ్‌ఖరే, భూపాలపల్లి జిల్లా ఎస్పీ

- కొత్త పీఎస్‌ల ఏర్పాటుకు సిద్ధమైన ప్రభుత్వం
- ప్రతిపాదనలు పంపిన జిల్లా పోలీసు యంత్రాంగం
- శాంతిభద్రతల రక్షణే లక్ష్యంగా ముందడుగు
- అనుమతులు రాగానే నిర్మాణాలు షురూ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయం

మరో నాలుగు..

జిల్లాకు అదనంగా పోలీస్‌స్టేషన్లు

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని అడుగులు ముందుకేస్తోంది. ప్రస్తుతం ఉన్న పోలీస్‌స్టేషన్లకు అదనంగా మరికొన్నిటిని నిర్మించాలని యోచిస్తోంది. ఇందుకు ప్రణాళికను రూపొందించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో జనాభా, పరిపాలనకు తగ్గట్టు ఈ కొత్త పోలీస్‌స్టేషన్ల ఆవశ్యకత ఉందని ప్రభుత్వం భావిస్తోంది.

కొత్త పోలీస్‌స్టేషన్ల నిర్మాణంపై ప్రతిపాదనలను పంపాలని ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసిన నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ నివేదికలు రూపొందించింది. జిల్లాలో కొత్తగా నాలుగు పోలీస్‌స్టేషన్లు అవసరమని ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వం నుంచి ఆమోదం పొందగానే జిల్లాలో అదనంగా నాలుగు ఠాణాల నిర్మాణం జరగనుంది. కొత్తపల్లిగోరి మండలంలో ఒక పోలీస్‌స్టేషన్‌తోపాటు జిల్లా కేంద్రంలో మహిళా పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్, సైబర్ పోలీస్‌స్టేషన్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపారు.

తొలగనున్న ఇబ్బందులు

ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసే నాలుగు ఠాణాలతో వివిధ రకాల ఇబ్బందులు తొలగనున్నాయి. కొత్తగా ఏర్పడిన కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఏర్పడితే ఈ మండలంలో ఉన్న గ్రామాల ప్రజలకు దూరభారం తగ్గనుంది. ఫలితంగా శాంతిభద్రతలు సైతం అదుపులో ఉండనున్నాయి. ఏ కష్టమొచ్చినా త్వరగా వెళ్లే వెసులుబాటు ఉండనుంది. ఇక జిల్లా కేంద్రంతోపాటు ప్రస్తుతం ఉన్న పోలీస్‌స్టేషన్లలో మహిళలు, యువతులకు ఎదురయ్యే సమస్యలను చెప్పుకొనేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సరిపడా మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పడితే మహిళలు, యువతులకు మరింత భరోసా కలగనుంది. ఇక జిల్లా కేంద్రానికి పెరుగుతున్న వాహనాల రాకపోకలతో ప్రస్తుతం ఉన్న పోలీసులు అటు శాంతిభద్రతలు, ఇటు ట్రాఫిక్ నియంత్రణపై పెద్దగా దృష్టి సారించలేకపోతున్నారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. జాతీయ రహదారి కావడం, నిత్యం వందల సంఖ్యలో లారీలు, ఇతరత్రా వాహనాలు రాకపోకలతో రోడ్లన్నీ రద్దీగా ఉంటున్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ప్రత్యేకంగా ఏర్పడితే పర్యవేక్షణ మెరుగుపడి రోడ్డు ప్రమాదాలను నియంత్రించొచ్చని తెలుస్తోంది. ఇక రోజురోజుకూ సైబర్ మోసాలు పెరుగుతున్న దృష్ట్యా బాధితులకు అందుబాటులోకి ఆ విభాగ పోలీస్‌స్టేషన్ ఆవశ్యకత ఉంది.

16కు చేరనున్న పోలీస్‌స్టేషన్ల సంఖ్య

భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో భూపాలపల్లి, కాటారం రెండు సబ్ డివిజన్లు ఉన్నాయి. భూపాలపల్లి, చిట్యాల, కాటారం, మహదేవపూర్ నాలుగు సర్కిళ్లు ఉన్నాయి. వీటిల్లో ప్రస్తుతం కాళేశ్వరంలోని పోలీస్‌స్టేషన్‌ను కలుపుకొని 12 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన కొత్తపల్లిగోరి మండలంతోపాటు మహిళా, ట్రాఫిక్, సైబర్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుతో ఠాణాల సంఖ్య 16కు చేరనుంది.

మోడల్ స్కూల్ టీచర్, అటెండర్‌పై వేటు

కాటారం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు మనోహర్ సస్పెండ్ అయ్యారు. ఔట్‌సోర్సింగ్ అటెండర్ కోక్యా తొలగింపునకు గురయ్యారు. కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశాలతో డీఈవో రాజేందర్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 28న పాఠశాలకు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన ఏడు క్వింటాళ్ల బియ్యం వాహనంలో రాగా విద్యార్థులతో బియ్యం బస్తాలు ఎత్తే పనులు చేయించారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ నాగరాజు పాఠశాలకు వెళ్లి విచారణ చేశారు. ఇందులో బియ్యం బస్తాల వాహనంతో హమాలీలు తక్కువ సంఖ్యలో రావడంతో కొందరు విద్యార్థులను బస్తాలు మోసేందుకు అటెండర్ పురమాయించారని ఆరోపణలు వచ్చాయి. దీంతో ద్యార్థులు వాహనంపైకి ఎక్కి, బస్తాలను అందించే పనులు చేశారని విచారణలో తేలింది. విద్యార్థులు బయటికి వచ్చి పనులు చేస్తున్న ఆ రోజు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్న ఫిజిక్స్ టీచర్ మనోహర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని వెల్లడైంది. ఈ నివేదికపై కలెక్టర్ స్పందించారు. టీచర్ మనోహర్‌ను సస్పెండ్ చేయాలని, అటెండర్‌ను విధుల నుంచి తొలగించాలని సమగ్ర శిక్ష ఎక్స్ అఫిషియో ప్రాజెక్ట్ అధికారి అయిన డీఈవో రాజేందర్‌ను ఆదేశించడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

పశువుల స్వాధీనం

ఏటూరునాగారం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పశువులను స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎస్.కె.తాజుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని 163వ జాతీయ రహదారిపై, మండల కేంద్రంలోని వై-జంక్షన్ వద్ద ఆదివారం తెల్లవారుజామున పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా అదే సమయంలో వాజేడు వైపు నుంచి రెండు కంటైనర్ల లారీలు వచ్చాయి. పోలీసులను చూసి డ్రైవర్లు పరారు కాగా కంటైనర్లను స్వాధీనం చేసుకొని తనిఖీ చేయగా సుమారు 65 పశువులు అందులో ఉన్నాయి. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు పశువులను భద్రాది కొత్తగూడెం జిల్లాలోని చర్ల మండలంలో పశువులను కొనుగోలు చేసి కబేళాలకు తరలిస్తున్నట్టు గుర్తించామని ఎస్సై తెలిపారు. రెండు కంటైనర్లను సీజ్ చేసి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. పట్టుబడిన కంటైనర్లలోని 65పశువులను భూపాలపల్లి జిల్లా రాంపూర్ గ్రామంలోని గోశాలకు తరలించామన్నారు. కంటైనర్లలో పశువులను అత్యంత దారుణంగా కుక్కి తరలిస్తున్నారని, దీనివల్ల కొన్ని మరణించాయని తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న పశువులు

ఎస్సారెస్పీ నీళ్లు వదలాలి

బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

రేగొండ, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : ఎస్సారెస్పీ డీబీఎం 38 కాల్వ ద్వారా నీళ్లు వదలాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్ నేతృత్వంలో రేగొండలోని పరకాల-భూపాలపల్లి రహదారిపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో చేశారు. దీంతో రోడ్డుపై వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు అక్కడికి చేరుకొని నిరసనకారులను స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు సకాలంలో సాగునీరు అందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా, వడ్లకు బోనస్, రూ. 2 లక్షల రుణమఫీ లాంటి పథకాలు అందని ద్రాక్షగా మారాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాపిరెడ్డి, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు హింగె మహేందర్, నాయకులు కొలెపాక భిక్షపతి, బండి రమేష్, బీక్యానాయక్, దగ్గు వెంకన్న, దాట్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

42 కి.మీ మారథాన్‌లో గండ్ర జ్యోతి ప్రతిభ


సాధించిన మెడల్‌ను చూపిస్తున్న గండ్ర జ్యోతి

భూపాలపల్లి కృష్ణ కాలనీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):జపాన్ దేశ రాజధాని టోక్యోలో జరిగిన 42 కిలో మీటర్ల మారథాన్ రన్‌లోబీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆదివారం పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ రన్‌తో ఆమె ఆరు ప్రతిష్ఠాత్మక మారథాన్లను పూర్తి చేసుకున్నారు. ప్రపంచంలో ఉన్న ఆరు ప్రతిష్ఠాత్మక మారథాన్‌లలో టోక్యో ఒకటి. ఇది వరకే చికాగో, బోస్టన్, బెర్లిన్, న్యూయార్క్, లండర్ మారథాన్లలో పాల్గొన్నారు. ఆరో మారథాన్ అయిన టోక్యోలో జరిగిన రన్‌లో గండ్ర జ్యోతి పాల్గొని ఫినిషర్ మెడల్‌ను తన సొంతం చేసుకున్నారు.

ఆర్చరీ జాతీయ స్థాయి పోటీలకు అనయ ఎంపిక


కాంస్య పతకంతో అనయ

కాటారం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : విలువిద్య(ఆర్చరీ) పోటీల్లో భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రానికిచెందిన రామిళ్ల అనయ జాతీయ స్థాయికి ఎంపికైంది. తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కరీంనగర్ ఉమ్మడి జిల్లా తరఫున పాల్గొని కాంస్య పతకం సాధించింది. అనయను కోచ్‌లు శ్రీనివాస్, అభిషేక్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ తదితరులు అభినందించారు.

రేపు బియ్యాల జనార్దన్‌రావు ఎండోమెంట్ లెక్చర్

- హాజరుకానున్న సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్

కేయూ క్యాంపస్ మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమ నేత, దివంగత ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావు 23వ ఎండోమెంట్ లెక్చర్ మార్చి 4న ఉదయం 11 గంటలకు కేయూ సెనెట్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావు మెమోరియల్ ఫౌండేషన్ బాధ్యులు ఆదివారం తెలిపారు. కేయూ వీసీ ప్రొఫెసర్‌కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగే లెక్చర్‌కు సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్ హాజరై 'తెలంగాణ అప్టర్ ఎ డికాడే : ఎమర్జింగ్ పొలిటికల్ అండ్ సోషల్ సినారీయస్' అనే అంశంపై కీలక ప్రసంగం చేస్తారని వెల్లడించారు. అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సాధికారతే లక్ష్యంగా...

- మహిళల కోసం కేంద్ర ప్రభుత్వ వినూత్న పథకం
- వెదురు మొక్కల పెంపకం ద్వారా స్వావలంబన
- పైలెట్ ప్రాజెక్టుగా భూపాలపల్లి
- రాష్ట్రంలో మరో మూడు జిల్లాల్లో కూడా అమలు



భూపాలపల్లిటౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. నారీమణుల స్వావలంబనకు ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు అమల్లో ఉండగా మరికొన్నిటికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఓవినూత్న పథకం నేషనల్ బ్యాంబూ (వెదురు)మిషన్‌ను ప్రవేశపెట్టింది. మారుమూల గ్రామీణ ప్రాంత మహిళలకు సబ్సిడీపై వెదురు మొక్కలు పంపిణీ చేసి, అవి పెరిగాక కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేయడం, తద్వారా వారి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడం ఈ పథకం ముఖ్యోద్దేశం. ఇందులో ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రత్యేక రాయితీ ఉంది. ఆ సామాజిక వర్గాల మహిళలకు ఉచితంగానే మొక్కలు పంపిణీ చేస్తుంది.

దినదినాభివృద్ధి చేసుకొనే అవకాశం

నేషనల్ బ్యాంబూ(వెదురు) మిషన్ ద్వారా మహిళలను లక్షాధికారులు చేయడమే లక్ష్యమని కేంద్రం అంటోంది. ఈ పథకం ద్వారా పోరంబోకు, వ్యవసాయానికి పనికిరాని భూముల్లో వెదురు మొక్కలు పెంచాల్సి ఉంటుంది. మహిళలు తమ సొంత భూమిలో గుంటకు నాలుగు మొక్కలు చొప్పున నాటాల్సి ఉంటుంది. ఈ మొక్కలను కేంద్ర ప్రభుత్వమే లబ్ధిదారుకు సబ్సిడీపై అందిస్తుంది. ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఉచితంగా పంపిణీ చేస్తుంది. నాలుగేళ్లపాటు లబ్ధిదారు ఏమీ ఆశించకుండా ఈ మొక్కలను పోషించుకోవాల్సి ఉంటుంది. ఐదో సంవత్సరం నుంచి దీని పంట చేతికి వస్తుంది. ఐదో ఏటా కనీసం రూ.40 వేల వరకు ఆదాయం వస్తుందని నిపుణులు చెబుతున్నారు. అనంతరం సంవత్సరానికి కొంత పెరుగుతూ 10వ సంవత్సరం వరకు ఏడాదికి రూ.1లక్ష ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అలా 40 సంవత్సరాల వరకు వెదురు చెట్లతో ఆదాయం తీసుకోవచ్చని స్పష్టం చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచితం..

నేషనల్ బ్యాంబూ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకొనే వారు కేవలం భూమి చూపిస్తే సరిపోతుందని, ఆ తర్వాత నేరుగా వెదురు మొక్కలు పంపిణీ చేస్తామని అధికారులు అంటున్నారు. అయితే.. భూమి ప్రభుత్వ, చెరువుశిఖం, అటవీ భూమియై ఉండొద్దని తెలిపారు. ఈ పథకం ద్వారా జిల్లాలోని మూడు మండలాలను ఎంపిక చేసి మొత్తం 400 మంది మహిళలకు లబ్ధి చేకూరుస్తామని అంటున్నారు.

భూపాలపల్లి జిల్లాలో ప్రయోగాత్మకంగా..

నేషనల్ బ్యాంబూ పథకంలో భూపాలపల్లి జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం ఎంచుకుంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ క్రమంలో రాష్ట్రంలో నాలుగు జిల్లాలకు అవకాశం ఇవ్వగా వాటిలో ఆదిలాబాద్, కుమరంభీం ఆసిఫాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు కూడా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లాలో ముందుగా పలిమెల, మహాముత్తారం, మహాదేవపూర్ మండలాలను ఎంచుకోనున్నారు. ఇవి పూర్తిగా అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉండటంతో ఈ మండలాలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఈ ప్రాజెక్టు అమలుకు అటవీశాఖ, హార్టికల్చర్, ఎన్‌జీఎన్ఆర్ ఈజీఎస్, సెర్ప్ సంస్థలను భాగస్వాములను చేశారు. ఇందులో కీలక పాత్ర ఎన్‌జీఆర్ ఈజీఎస్‌దే ఉంటుంది. గుంతలు తవ్వడం నుంచి మొక్కలు నాటి దానికి నీళ్లు పోసే వరకు ఆ విభాగానిదే ప్రధాన బాధ్యత.

ప్రారంభం కానున్న సర్వే..

అనువైన భూములను గుర్తించేందుకు త్వరలో సర్వే పనులు ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో మూడు మండలాలను గుర్తించగా అందులో అనువైన సొంత భూములను గుర్తించనున్నట్లు చెప్పారు. దీని కోసం డీఆర్‌డీఏ విభాగం పనిచేస్తుందని తెలిపారు. ప్రభుత్వ నిషేధిత భూముల్లో పెంచడానికి వీలు లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.


విస్సంపల్లి నుంచి ఉగ్గంపల్లి వెళ్లే రోడ్డులో కంచె లేకుండా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

యమ డేంజర్.. ట్రాన్స్‌ఫార్మర్

చిన్నగూడూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రజలు, మూగజీవాలు సంచరించే ప్రదేశాలలో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు భయపెడుతున్నాయి. ఎత్తులో బిగించాల్సిన ట్రాన్స్‌పార్మర్లు నేలపై, గజం ఎత్తులో ఫ్యూజ్ బాక్స్ వైర్లు చేతికి అందే విధంగా ఏర్పాటు చేయడంతో మండలంలో కొన్నిచోట్ల డేంజర్‌గా మారాయి. విస్సంపల్లి, ఉగ్గంపల్లి రహదారిలో రోడ్డు పక్కన చేతికందే విధంగా ఉండడమే కాకుండా కంచె కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్య ధోరణికి నిదర్శనం. ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణికులు, గ్రామాల్లో మూగ జీవులు నిత్యం వందలాదిగా ట్రాన్స్‌ఫార్మర్ సమీపం నుంచే రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి. దీంతో పరిసర ప్రజలు భయాందోళన చెందుతుండగా, ఏమైనా జరిగితేనే అధికారులు పట్టించుకుంటారా.. అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు


గద్దెల ప్రాంగణంలో చలువ పందిళ్ల నీడన భక్తులు

మేడారంలో భక్తుల సందడి

తాడ్వాయి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టపై తల నీలాలు సమర్పించారు. అనంతరం తల్లుల గద్దెల వద్దకు చేరుకొని ఎత్తు బంగారం, పూలు, పండ్లు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు సమర్పించుకున్నారు. యాట మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం సుమారు 10వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

నేడు కల్యాణ వీరభద్రుడి రథోత్సవం


భద్రకాళి సమేత వీరభద్రుడి ఊరేగింపునకు చెక్క రథాన్ని సిద్ధం చేస్తున్న ఆలయ సిబ్బంది

కురవి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు సోమవారం సాయంత్రం 6 గంటలకు వీరభద్రుడి రథోత్సవం జరుగనుంది. దాదాపు 70 ఏళ్ల కిందట చెక్కతో ఈ రథాన్ని స్వామి వారి ఊరేగింపు కోసం చేయించారు. 30 పీట్ల ఎత్తున్న ఈ రథంలో వీరభద్రుడి రథోత్సవం కన్నుల పండువగా ఉంటుంది. ఇంతపెద్ద చెక్కరథం ఈ ప్రాంతంలో మరెక్కడా లేదు. ఈపురాతన కాలపు రథాన్ని స్వామి వారి రథోత్సవంకోసం ఆలయ సిబ్బంది రంగులు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించనున్నారు. రథోత్సవానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ తెలిపారు. రథాన్ని లాగితే చేసిన పాపాలు తొలగుతాయని, కోరుకున్న కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. దీంతో రథోత్సవానికి ప్రతీ సంవత్సరం భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

వేం నరేందర్‌రెడ్డి సతీమణి ప్రత్యేక పూజలు

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సతీమణి వేం విజయ కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. వీరభద్రస్వామి, భద్రకాళి ఆలయాల్లో మొక్కులు తీర్చుకున్నారు. ఆమె వెంట ఆలయ చైర్మన్ కోర్ను రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంబటి వీరభద్రం, బండి వెంకట్‌రెడ్డి, వద్దుల సురేందర్‌రెడ్డి, వద్దుల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే ఎస్సారెస్పీ జలాలు


కురవి వద్ద ఎస్సారెస్పీ జలాలను పరిశీలిస్తున్న అంబటి వీరభద్రం

కురవి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ కృషితోనే చివరి ఆయకట్టు ప్రాంతమైన డోర్నకల్ నియోజకవర్గానికి ఎస్సారెస్పీ జలాలు అందాయని కురవి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం అన్నారు. కురవి ఎస్సారెస్పీ కాలువల్లో ప్రవహిస్తున్న జలాలను ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం వరిపంట పొట్ట దశలో ఉందని, రైతాంగానికి సాగు నీరు అవసరం కనుకనే ఎమ్మెల్యే జలాలను విడుదల చేయించారని పేర్కొన్నారు. ప్రస్తుతం చెరువుల్లోకి సైతం జలాలు వస్తున్నాయని, రైతాంగానికి ఎంతగానో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్‌నాయక్, బండి శ్రీను పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్లకు రేపటి నుంచి శిక్షణ

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2024లో ఎంపికై కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్న స్కూల్ అసిస్టెంట్, భాషా పండితులకు మంగళవారం నుంచి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈవో ఎం.జ్ఞానేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 602 మంది ఎస్ఏలకు ఈనెల 4 నుంచి 6 వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యే ఉపాధ్యాయులు సంబంధితపాఠ్యపుస్తకాలను వెంట తెచ్చుకోవాలని సూచించారు. జీహెచ్ఎస్ కరీమాబాద్‌లో తెలుగు ఎస్ఏ, భాషాపండితులు, ఎస్ఏ బయోసైన్స్‌లకు, జీహెచ్ఎస్ శంభునిపేటలో సోషల్, మ్యాథ్స్, హిందీ ఎస్ఏలతో పాటు హిందీ భాషా పండితులకు, జీహెచ్ఎస్ రంగశాయిపేటలో ఎస్ఏ ఇంగ్లీష్‌తో పాటు పీఈటీలు, పీడీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈవో పేర్కొన్నారు. అందరూ శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

నస్తూరుపల్లి అడవుల్లోకి పెద్దపులి


అడవుల్లో పులి ఆనవాళ్లను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు



కాటారం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కాటారం, మహదేవపూర్ రేంజ్ అడవుల్లో పెద్దపులి ఇంకా సంచరిస్తూనే ఉందని తెలుస్తోంది. గత నెల 10న నస్తూరుపల్లి అడవుల్లో పులి సంచరించినట్లు ఆనవాళ్లు దొరకగా 21 రోజులుగా డివిజన్ పరిధి లోని అడవుల్లో తిరిగిందనే ఆనవాలు కనిపించాయి. మళ్లీ నస్తూరుపల్లి అడవుల్లోకి వచ్చినట్లు అటవీ అధికారులు వెల్లడించారు. శనివారం ప్రతాపగిరిఅడవుల్లోని పులితోగు వాగు నుంచి పలుచోట్ల పెద్దపులి పాదముద్రల ఆనవాళ్లు కనిపించగా ఆదివారం అటవీ అధికారులు, సిబ్బంది దాని జాడ కోసం అడవులను జల్లెడ పట్టారు. అటవీశాఖ కాటారం, యామన్‌పల్లి డిప్యూటీ రేంజర్లు సురేందర్, శ్రీనివాస్ నేతృత్వంలో అటవీ అధికారులు, సిబ్బంది అడవుల్లోని బాటలు, వాగులనుపరిశీలిస్తూ వెళ్లారు. మర్రిపల్లి అడవుల మీదుగా కాటారం రేంజ్ అడవుల నుంచి నస్తూరుపల్లి అడవుల్లోకి పులి వెళ్లినట్లు పాదముద్రల ద్వారా గుర్తించారు. అడవుల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ఇతరులు అడవుల్లోకి వెళ్లొద్దని అటవీ అధికారులు హెచ్చరిస్తున్నారు. 21 రోజులుగా పెద్దపులి డివిజన్ అడవులను కలియతిరిగి మొదట ఆనవాలు కనిపించినా నస్తూరుపల్లి అడవుల్లోకి రావడంతో తన స్థావరం కోసం హద్దులను నిర్ణయించుకుని ఉండొచ్చని ట్రాకర్స్ అభిప్రాయపడుతున్నారు. పులి ఏ ప్రాంతం నుంచి వచ్చిందో త్వరలో అక్కడికే తిరిగి వెళ్లొచ్చని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పులి సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలు అడవుల్లోకి వెళ్లొద్దని, దానికి హాని చేసే చర్యలు చేపట్టొద్దని అధికారులు అంటున్నారు. అడవులను గాలిస్తున్న బృందాల్లో ఫారెస్టు అధికారులు చంద్రశేఖర్, రాజేందర్, మొయినొద్దీన్, మోనా కౌసర్, జయలక్ష్మి, సంజీవ్, అశోక్, రాజ్‌కుమార్, బేస్‌క్యాంప్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

9న జిల్లా స్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా చెస్ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 9న హనుమకొండ కాకతీయ డిగ్రీ కళాశాలలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ బాలబాలికల విభాగంలో ఈ టోర్నీ నిర్వహించడం జరుగుతుందని, ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచిన క్రీడాకారులకు నగదు పురస్కారంతో పాటు బహుమతులను, ప్రశంస పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 90595 22986 నెంబర్‌లో సంప్రదించాలని కన్నా పేర్కొన్నారు.

జ్వరంతో శిశువు మృతి


పాప మృతదేహం

వాజేడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జ్వరం, జలుబుతో బాధపడుతూ 54 రోజుల శిశువు మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చంద్రుపట్లకు చెందిన గోగు బాలకృష్ణ, భారతి దంపతులు ఏడాది కాలంగా మండల కేంద్రంలోని గుడిసెల పోరాట కేంద్రం వద్ద నివాసం ఉంటున్నారు. వీరికి మూడో సంతానంగా 54 రోజుల క్రితం పాప జన్మించింది. మూడు రోజుల క్రితం ఆ శిశువుకు జ్వరం, జలుబు బారినపడింది. దీంతో వాజేడు వైద్యశాలకు తీసుకెళ్లారు. పరీక్షించిన అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లాలని సూచించడంతో శనివారం శిశువును అక్కడికి తరలించి చికిత్సను అందించారు. జలుబు ఎక్కువగా ఉండటంతో నిమ్ము ఎక్కువగా ఉందని, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లాలని ఏటూరునాగారం వైద్యులు సూచించారు. అయితే.. ప్రయాణ ఖర్చులకు ఆర్థిక స్తోమత లేకపోవంతో వరంగల్ వెళ్లతకుండా వాజేడులో మండలంలోని చెరుకూరులో ఓఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున పాపలో కదలికలు లేకపోవడంతో 108 అంబులెన్స్‌లో వాజేడుకు వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆ శిశువు మృతిచెందిందని వైద్యులు ధ్రువీకరించారు.

వ్యాక్సిన్ వేయకపోవడం వల్లేనా?

పాపకు 45వ రోజు వ్యాక్సిన్ వేయాల్సి ఉండగా వైద్యశాలకు వెళ్లగా అది అందుబాటులో లేదని చెప్పారని తల్లిదండ్రులు తెలిపారు. దీంతో మరోసారి వెళ్లినా అదే సమాధానం చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో వేయాల్సిన వ్యాక్సిన్ వేస్తే పాప బతికేదని అంటున్నారు. దీనిపై వాజేడు వైద్యాధికారి మధుకర్ మాట్లాడుతూ పాప మరణానికి, వ్యాక్సిన్‌కు సంబంధం లేదని స్పష్టం చేశారు. జ్వరం, జలుబుతో ఉన్న పాపను మూడు రోజుల క్రితం తీసుకురాగా ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించామని ఆయన తెలిపారు. జ్వరం ఉంటే వ్యాక్సిన్ వేయటం కుదరదని, పాప మృతికి వ్యాక్సిన్ వేయకపోవడం కారణం కాదని చెప్పారు.

వట్టిపోయిన ఆకేరు


ఉగ్గంపల్లి-చిన్నగూడూరు మధ్య ఎండిపోయిన ఆకేరు వాగు

చిన్నగూడూరు (మహబూబాబాద్ జిల్లా), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : చిన్నగూడూరు, ఉగ్గంపల్లి గ్రామాల మధ్య ప్రవహించే ఆకేరులో నీరు ఇంకిపోయి రాళ్లు తేలగా రైతులు కన్నీరు పెడుతున్నారు. ఆకేరు ఎండిపోవడంతో ఆ ప్రాంత భూగర్భ జలాలపై ప్రభావం చూపుతోంది. వ్యవసాయ బావుల్లో తగ్గిన నీటి మట్టమే ఇందుకు నిదర్శనం. మండలంలోని చిన్నగూడూరు, మన్నెగూడెం, జయ్యారం, విస్సంపల్లి, ఉగ్గంపల్లి గ్రామాల రైతులు ఆకేరుపై ఆధారపడి సూమారు 2,500 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేశారు. మరో నెల వరకు వరికి సాగునీరు అందాల్సి ఉంది. ఆకేరు ఎండిపోయి వేరే ప్రత్యామ్నాయం లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు మండే ఎండలు ఒక్కింత రైతులను కలవరపెడుతున్నాయి. ఆకేరుకు ఎస్సారెస్పీ జలాల జాడలేదని, దీని గురించి పట్టించుకునే వారే కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకున్న ఫ్యాషన్ పరేడ్

అలరించిన డీజే

- ముగిసిన స్ప్రింగ్ స్ప్రీ
- తిరుగుముఖం పట్టిన విద్యార్థులు
- మధురానుభూతులను మిగిల్చిన వసంతోత్సవం
- చివరి రోజు కొనసాగిన పలు ఈవెంట్లు
- నాటకానికి కొత్త అంకం దిద్దిన నుక్కడ్
- టీమ్ స్పిరిట్‌తో విజయవంతం

హనుమకొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో గత మూడు రోజులుగా అంగరంగ వైభంగా జరిగిన వసంతోత్సవం (స్ప్రింగ్ స్ప్రీ-2025) ఆదివారంతో ముగిసింది. మూడో రోజు కూడా 20కి పైగా ఈవెంట్లు జరిగాయి. వీటిలో విద్యార్థులు పోటాపోటీగా పాల్గొన్నారు. తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించి విజేతలుగా నిలిచారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈవెంట్లు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగాయి. ఆదివారం జరిగిన ఫైనల్ ఈవెంట్లు ఉత్కంఠగా సాగాయి. విద్యార్థులుపెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరి రోజున పలు కొత్త ఈవెంట్లు జరిగాయి. గతంలో జరిగిన ఈవెంట్లతో పాటు ఈ సారి కొత్తగా నిర్వహించిన ఈవెంట్లు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విజేతలకు అప్పటికప్పుడే బహుమతులను ప్రదానం చేశారు.



నిట్ క్యాంపస్ ఆవరణలో విద్యార్థులు ప్రదర్శిస్తున్న వీధి నాటకం (నుక్కడ్)



నాటకాన్ని రికార్డు చేస్తున్న విద్యార్థిని

నుక్కడ్

చివరి రోజు కళాశాల క్యాంపస్ ఆవరణలో ఆడిటోరియం ఎదురుగా విశాలమైన స్థలంలో నిర్వహించిన నుక్కడ్ (వీధి నాటకం) ఈ వసంతోత్సవానికే హైలైట్‌గా నిలిచింది. ప్రతీ సంవత్సరంలాగే ఈ సారి కూడా చివరి రోజు సాయంత్రం బహిరంగ ప్రదేశంలో నిర్వహించిన ఈ వీధి నాటకంలో సుమారు 50 మంది విద్యార్థులు ఏకరూప దుస్తులతో నటులుగా పాల్గొన్నారు. సమకాలీన సమాజంలోని సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకొని వాటిపై ప్రదర్శించిన ఈ వీధి నాటకం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది.

వారిని ఆలోచింప చేసింది. నుక్కడ్ ఒక వీధి నాటక ప్రదర్శన. దీనికి థియేటర్లు అవసరం లేదు. బహిరంగ ప్రదేశమే రంగ స్థలం. దీనికి ప్రేక్షకులు డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు. మైక్రోఫోన్లు, స్పీకర్లు కూడా అవసరం లేదు. నటులు మేకప్ వేసుకోవలసిన అవసరమూ ఉండదు. నుక్కడ్‌లో పాల్గొనే నటులు తమ సహజ స్వరూప స్వభావాలపై ఆధారపడి నటించాలి. యువతీ యువకులు, ఉత్సాహవంతులైన ప్రదర్శకులు తమ సందేశాన్ని తెలియచేయడానికి సంభాషణ, సంగీతం, నృత్యాల కలయికతో ప్రేక్షకులకు చెప్పదలుచుకున్న సందేశాన్ని సూటిగా, బలంగా చేరవేస్తారు. నుక్కడ రంగస్థల నాటకాలకు ఇది మరోరూపం. నిట్‌లో నిర్వహించిన నుక్కడ్‌ను వీక్షించేందుకు విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. సుమారు రెండు గంటల పాటు నిర్వహించిన ఈ ఈవెంట్‌ను విద్యార్థులు తమ సెల్‌ఫోన్లలో రికార్డు చేయడం కనిపించింది.

తళుక్కుమన్న తారలు

గ్రాండ్ ఫినాలేలో భాగంగా నిట్ ఆడిటోరియంలో రాత్రి పొద్దుపోయిన తర్వాత జరిగిన డిజేతో క్యాంపస్ దద్దరిల్లింది. సుప్రసిద్ధగాయకుడు నిఖిల్ డిసౌజ తన అద్భుతమైన సంగీతంతో శ్రోతలను మైమరిపించారు. డిసౌజ పాటలు విద్యార్థులను ఉర్రూతలూగించింది. పాటలకు అనుగుణంగా వారు స్టెప్పులు వేశారు. ఆనందంతో కేరింతలు కొట్టారు. కార్యక్రమం జరుగుతున్నంత సేపు స్టేడియం జిగేల్‌మనే రంగురంగుల విద్యుదీపాలతో సందడిగా మారింది. కొత్త సంగీత ప్రపంచాన్ని ఆవిష్కరించింది.

ఫ్యాషన్ షో

చివరి రోజు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్న మరో ఈవెంట్ ఫ్యాషన్ షో. అల్యూర్ పేరుతో రాత్రి పొద్దుపోయిన తర్వాత జరిగిన ఈ ఈవెంట్‌లో విద్యార్థులు వివిధ రకాల మోడ్రన్ దుస్తులను ధరించి ఈ షోలో పాల్గొన్నారు. యువతీ యువకులు సోలోగాను, జంటలుగానూ ఫ్యాషన్ దుస్తులతో కనువిందు చేశారు. ఒక కొత్త ఫ్యాషన్ ప్రపంచాన్ని ఆవిష్కరించారు. 50 మందికిపైగా యువతీ యువకులు ఇందులో పాల్గొన్నారు. సరికొత్త ఫ్యాషన్స్ ఆవిష్కరించారు.

సంగీతోత్సవం





సంగీతోత్సవంలో భాగంగా నిర్వహించిన సింగింగ్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, డ్యాన్స్ ఈవెంట్లలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంగీతోత్సవంలో తబలా, గిటార్, పియానో వంటి వాయిద్యాలతో విద్యార్థులు తమ సంగీత ప్రతిభను ప్రదర్శించారు. సోలో ఐడల్‌లో స్ప్రింగ్ స్ప్రీ సిగ్నేచర్ ఈవెంట్‌లో భాగంగా విద్యార్థులు ర్యాప్ పాటలతో శ్రోతలను అలరించారు.

తిరుగు ముఖం



వసంతోత్సవంలో మూడు రోజుల పాటు పాల్గొన్న దేశంలోని వివిధ ఎన్ఐటీలకు చెందిన విద్యార్థులు సాయంత్రం తిరుగుముఖం పట్టారు. మూడు రోజుల పాటు జరిగిన వివిధ ఈవెంట్లలో పాల్గొన్న వీరు మధురజ్ఞాపకాలు, అనుభూతులను మూటగట్టుకొని తోటి విద్యార్థులకు వీడలేమంటూ, వీడిపోమంటూ భావోద్వేగాలతో వీడ్కోలు పలికారు. తిరిగి వెళుతున్న క్రమంలో మూడు రోజులు తమతో కలిసి ఉన్న, ఈవెంట్లతో పోటీ పడిన, ఆట పాటలతో సందడిగా గడిపిన తోటి విద్యార్థులను ఆలింగనం చేసుకొని , సెల్ఫీలు, ఆటోగ్రాఫ్‌లను తీసుకున్నారు. వచ్చే సంవత్సరం మళ్లీ కలుద్దామంటూ పరస్పరం వీడ్కోలు చెప్పుకున్నారు.

బ్లిట్జ్ బుల్లెట్‌లో విద్యార్థులు పోటీ

హనుమకొండ (ఆంధ్రజ్యోతి) :వరంగల్ నిట్‌లో వసంత్సోవం ముగింపు రోజైన ఆదివారం కూడా వివిధ ఈవెంట్లు కొనసాగాయి. ఇందులో బిట్జ్ బుల్లెట్ ఈవెంట్ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. ఒక విధంగా చదరంగం ఆటనే. చెస్ చాలెంజ్. మేధోబలపరీక్ష. శీఘ్ర నిర్ణయాలతో ఆటగాళ్లు ఈ చెస్ పోటీలో ప్రతిభను చూపారు. ఎవరు ఎంత త్వరగా నిర్ణయాలను తీసుకోవడం ద్వారా ప్రత్యర్థికి చెక్ పెడతారో వారే విజేత. పోలరాయిడ్ ఫోటోగ్రఫీ ఈవెంట్‌లో పాల్గొన్నవారు తక్షణమే అందించబడిన పోలరాయిడ్ ఫోటోల ద్వారా తమ జ్ఞాపకాలను సజీవంగా దాచుకునే అవకాశం పొందారు. స్ట్రీట్ ఫోటోగ్రఫీ పోటీలో పాల్గొన్న విద్యార్థులు కేవలం 15 నిమిషాల్లో వీధి జీవితం, సంస్కృతిని గుణాత్మకంగా ఫోటోల్లో బంధించి ఫ్రేమ్ ఆఫ్ ఫ్రేమ్‌లో ప్రదర్శించారు. క్యూఫ్యాక్టర్ క్విజ్‌ను వరంగల్ ఎన్ఐటీ పూర్వ విద్యార్థి ఆబాస్ దాస్ గుప్తా నిర్వహించారు. చరిత్ర, క్రీడలు, పాప్ కల్చర్ తదితర విభాగాల్లో అడిగిన ఆసక్తికరమైన ప్రశ్నలతో ఉత్కంఠంగా సాగింది, ప్లింకో బోర్డు గేమ్ ఆఫ్ సిల్క్ అండ్ లక్ ఈవెంట్‌లో ఆటగాళ్లు గరిష్ఠ స్కోర్ కోసం ప్రయత్నించారు. వాట్స్ ఇన్ ది బాక్స్ ఈవెంట్‌లో విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకొని స్పర్శతోనే వస్తువులను గుర్తించి నవ్వులు పూయించారు. పిక్చర్ పజిల్ ఈవెంట్‌లో వైద్యరంగానికి సంబంధించిన చిత్రాలను సరైన విధంగా అమర్చడం ద్వారా విజేతలుగా పోటీలో నిలిచారు.



బ్లిట్జ్ బుల్లెట్-చెస్ చాలెంజ్‌లో పోటీ పడుతున్న విద్యార్థులు



విభిన్న కళ.. భళా

- డిజిటల్‌కు దీటుగా ఫ్యాబ్రిక్ పెయింటింగ్
- ఇండ్లు, గోడలపై ప్రకృతి అందాల చిత్రీకరణ
- క్రియేటీవ్ ఆర్టిస్టుగా రాణిస్తున్న సాంబమూర్తి

హనుమకొండ చౌరస్తా, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): 'కుక్కపిల్ల.. అగిపుల్ల.. సబ్బుబిళ్ల.. కాదేదీ కవితకు అనర్హం' అన్న చందంగా ఎంచుకున్న రంగంపై ఆసక్తికి కృషి తోడైతే రాణించే అవకాశం ఉంటుందనేది నిరూపించారు హనుమకొండకు చెందిన ఫ్యాబ్రిక్ చిత్రకారుడు ఆవునూరి సాంబమూర్తి. విభిన్న ఆలోచనలతో ప్రయోగాలు చేస్తుంటే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందనడానికి ఆయనే ఓ నిదర్శనం. పెరిగిన డిజిటల్ వినియోగంతో చిత్రకారులు ఆదరణ కోల్పోతున్నారు. ఒకప్పుడు ఎన్నికల సమయంలో రాజకీయ నాయకుల ప్రచారం కోసం పేర్లు, బొమ్మలను వేయడంలో బిజీగా ఉండే చిత్రకారులను ఫ్లెక్సీ, ఇతర ప్రింటింగ్‌లు తీరని విధంగా దెబ్బతీశాయి. ఈ క్రమంలో మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ పడుతూ చిత్రకళా రంగంలో నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నాడు ఫ్యాబ్రిక్ చిత్రకారుడు సాంబమూర్తి. శాలివాహన (కుమ్మరి) కులానికి చెందిన ఆయన తమ కుల వృత్తిని ఎంచుకుని కుండలు చేసే సందర్భంలో తన వాళ్లలా కాకుండా ఏదైన ప్రత్యేకత చూపాలన్న సంకల్పంతో చిత్ర కళలపట్ల వచ్చిన ఆలోచనను అమల్లోకి తెచ్చారాయన. చదివింది పదో తరగతి అయినా ఏదైనా సాధించాలనే పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని, ఆర్థిక పరిస్థితుల వలన చదువును మధ్యలోనే ఆపేసి.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలనే నిశ్చయంతో ఫ్యాబ్రిక్ పెయింటింగ్ (మందమైన వస్త్రాలపై బొమ్మలు వేయడం)ను ఎంచుకున్నారు. పలు చిత్రాలను గీస్తూ అందరి మన్ననలు పొందుతూ చిత్రకళకు ఎప్పుడు ఆదరణ ఉందని నిరూపిస్తున్నారు. ప్రస్తుత సమాజానికి అవసరమయ్యే రీతిలో సరికొత్త ఆవిష్కరణలు చేస్తున్నాడు. కాలుష్యం వెదజల్లే ఫ్లెక్సీల కన్నా తాను రూపొందించిన చిత్రాలతో పర్యావరణానికి ఎలాంటి విఘాతం ఉండదని చెబుతున్నారు. పెళ్లిళ్ల, శుభకార్యాల్లో కావల్సిన అలంకరణలు, అద్భుతాలను తన చిత్రకళలతో వీక్షకులను కట్టిపడేలా రూపొందిస్తున్నారు. చిత్రకళనే వృత్తిగా మలుచుకొని పోటీ ప్రపంచంలో స్వయం ఉపాధి పొందుతూ ఇతరులకు ఆదర్శంగా నిలుసున్న సాంబమూర్తి పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌తో పర్యావరణాన్ని పరిరక్షిస్తూ విభిన్న కోణాల్లో తన ప్రతిభతో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్, విశ్వవ్యాప్తంగా ఉన్న జీవప్రాణిని కాపాడటం, హింస్మాతక, శాంతియుత బోధనలు, భారతదేశం అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉందనే చిత్రాలను రూపొందించారు. ఇవే కాకుండా కొబ్బరి బొండాలపై నూతన వధువరుల చిత్రాలు, రావి ఆకులపై దేవతామూర్తుల చిత్రాలను గీస్తూ కళకు జీవం పోస్తున్నారు. వివాహ శుభ కార్యాల్లోనూ థర్మకోల్ షీట్ల పై బొమ్మలు వేసి స్వాగత తోరణాలు ఏర్పాటు చేయడం నుంచి వేదికపై రకరకాల పూల ఆకృతులను సొంతంగా తయారు చేసి అలంకరించడంలో తానకు తానే సాటిగా నిలుస్తున్నారు సాంబమూర్తి.

చిత్రకళాకారులకు ఆదరణ అంతంత మాత్రమే..

ఆవునూరి సాంబమూర్తి, ఫ్యాబ్రిక్స్ చిత్రకారుడు



కంప్యూటర్ యుగంలో చిత్రకళాకారులకు ఆదరణ అంతంత మాత్రమే అయింది. నా చిన్నతనంలో మా నాన్న కుల వృత్తిగా కుండలు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్న సమయంలో నాకు ఇందులోనే ఏదైనా ప్రత్యేకత సాధించాలన్న సంకల్పం కలిగింది. అలా మొదలైన ఆలోచనే నేటి పోటీ ప్రపంచంలో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొంటూ చిత్రాలు గీస్తూ ఉపాధి పొందుతున్నా. రాష్ట్ర ప్రభుత్వం నా లాంటి చిత్రకారులను ప్రోత్సహించి ఆదరిస్తే మరెన్నో అద్భుతాలను సృష్టిస్తాం.

చిత్రకళలో సాంబమూర్తి ప్రస్థానం

వరంగల్‌లోని సీహెచ్ భద్రయ్య ఆర్ట్స్ సంస్థలో ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో శిక్షణ పొందిన సాంబమూర్తి వాటర్ పెయింటింగ్ అకరెల్ కలర్స్‌తో బొమ్మలు వేయడంలో ఓనమాలు నేర్చుకొని రాజకీయ నాయకుల, ఎన్నికల ప్రచార పత్రాలు, గోడలపై రాతలను రాస్తూ పలువురి మన్ననలు అందుకున్నాడు. 1996లో తాను వేసిన చిత్రాలను ప్రదర్శనకు పెట్టగా అంతర్జాతీయ మిమిక్రీ కళాకారుడు దివంగత డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ ప్రశసించారు. అలాగే 2012లో లలిత కళా పరిషత్ అఖిల భారత చిత్ర కళా ప్రదర్శనలో తన ప్రతిభను ప్రదర్శించారు.



సాంబమూర్తి కుంచె నుంచి జాలువారిన కళా ఖండాలు

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

- నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు
- అర్ధరాత్రి తేలనున్న విజేత ఫలితం



నల్లగొండలో టీచర్ ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సోమవారం ఉదయం నుంచి ప్రారంభం కానుంది. నల్గొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నల్గొండ జిల్లా కేంద్రంలోని ఆర్జాల బావి (స్టేట్ వేర్ హౌస్ గోదాం)లోని ఓట్ల లెక్కింపు కేంద్రంలో నిర్వహించనున్నారు. లెక్కింపు కేంద్రంలో అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో 200 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 25,797 ఓట్లకు గాను 24,139 ఓట్లు పోలయ్యాయి. పోలైన మొత్తం ఓట్లలో 50 శాతానికి పైగా ఓట్లు సాధించిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో మొదటి ప్రాధాన్యత ఓటుతో విజేతలను నిర్ణయించే పరిస్థితులు లేవనే చెప్పాలి. దీంతో రెండవ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాతనే అభ్యర్థుల జయాపజయాలు తేలే అవకాశం ఉంది. అయితే నల్గొండ-వరంగల్-ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 19 మంది అభ్యర్థులు పోటీ పడగా ప్రధానంగా అయిదుగురు అభ్యర్థుల మధ్యనే పోటీ ఉన్నట్లు తెలుస్తుంది. ఇందులో సిట్టింగ్ ఎమ్మెల్సీ, యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి, బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి, పీఆర్టీయూ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి, పూల రవీందర్, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిల మధ్యనే ప్రధాన పోటీ ఉన్నట్లు తెలుస్తుంది. కౌంటింగ్ ప్రక్రియలో 25 టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. 8 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి చేయనునట్లు అధికారులు ప్రకటించారు. సోమవారం ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం వరకు కొనసాగే అవకాశం ఉంది.

అభ్యర్థి భవితవ్యం తేలేది అర్ధరాత్రికే

ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ సాయంత్రం 6 గంటల వరకు మొదటి ప్రాధాన్యత క్రమం ఓట్ల లెక్కింపు కొనసాగే అవకాశం ఉంది. ఇక మొదటి ప్రాధాన్యత క్రమం ఓట్ల లెక్కింపులో భవితవ్యం తేలే పరిస్థితులు దాదాపుగా లేవనే చెప్పాలి. ఆ తర్వాత ప్రారంభమయ్యే రెండవ ప్రాధాన్యత క్రమం ఓట్ల లెక్కింపు అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశం ఉంది. రెండవ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాతనే విజేతను ప్రకటించే అవకాశం ఉంది. అర్ధరాత్రి తర్వాతే టీచర్స్ ఎమ్మెల్సీ విజేత ఎవరనేది తేలనుంది. ఒక వేల రెండవ ప్రాధాన్యతలో కూడా తేలకపోతే మూడవ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం వరకు కొనసాగే అవకాశం ఉంది.

ఓరుగల్లు ఓట్లే కీలకం

ఎన్నికల ఫలితాల్లో విజేతను నిర్ణయించే ఓట్లలో ఓరుగల్లు ఓట్లే కీలకం కానున్నాయి. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజేతనే నిర్ణయించేది ఉమ్మడి వరంగల్ జిల్లా ఓట్లే అంటున్నాయి ఉపాధ్యాయ వర్గాలు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలైన 10,401 ఓట్లే కీలకం కానున్నట్లు ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ వర్గాలతో పాటు అభ్యర్థులు అదే లెక్కల్లో ముగినితేలుతున్నారు. నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో ప్రధానపోటీదారులకు దాదాపుగా సమానంగా ఓట్లు పోలయ్యే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలైన ఓట్లలో మొదటి ప్రాధాన్యత, రెండవ ప్రాధాన్యత ఓట్లతో స్పష్టమైన ఆధిక్యత వచ్చే అభ్యర్థే గెలుపు తీరాలకు చేరుతారని వారు విశ్లేషిస్తున్నారు.

అభ్యర్థుల్లో ఉత్కంఠ

ఎవరికి వారు గెలుపు ధీమాలో ఉన్న అయిదుగురు అభ్యర్థులు తెల్లవారితే తేలే వారి భవిత్యంపై ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే వారు వారి అనుయాయులతో నల్గొండలో మకాం వేశారు. లెక్కింపు సరళిపై వారు మల్లగుల్లాలు పడుతున్నారు. రెండవ ప్రాధా న్యత ఓట్లు భారీగానే వచ్చినా, మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఎలిమినేట్ అయితే పరిస్థితి ఏంటని వారు మదన పడుతున్నారు.

కోతుల పంచాయతీ!

(5వ పేజీ తరువాయి)

అంచనా. ప్రతి ఆడకోతి తన జీవితకాలంలో కనీసం పది పిల్లలకు జన్మనిచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. దీంతో రోజు రోజుకు కోతుల సంతతితో వాటి బెడద పెరిగి పోతుండటంతో గత ప్రభుత్వం నిర్మల్ జిల్లాల్లో 2020 డిసెంబరు 20న మంకీ రెస్క్యూ, రిహాబిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. వన్యప్రాణుల సంరక్షణ చట్టానికి లోబడి ఈ సెంటర్‌లో కోతులకు సంతాన ఉత్పత్తి నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారు. అయితే వరంగల్ నుంచి నిర్మల్‌లోని సెంటర్‌కు కోతులను పట్టుకుని తీసుకెళ్లటం ఆర్థిక భారంగా మారింది.

ఊళ్లల్లో కోతుల భయం ఉన్నప్పటికి వాటిని పట్టుకునేందుకు పంచాయతీల వద్ద నిధుల కొరత వెంటాడుతోంది. ఒక్క కోతిని పట్టాలంటే మంకీ క్యాచర్లకు సుమారు రూ.వెయ్యి ఖర్చవుతుంది. ఇలా వంద కోతులను పట్టుకోవాలంటే రూ. లక్ష వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇప్పటికే నిధులు లేక నీరసించి పోతున్న పంచాయతీలకు కోతుల నియంత్రణ కష్టంగా మారుతోంది. పైగా రాష్ట్రం మొత్తం మీద ఒక్క నిర్మల్ జిల్లా కేంద్రంలోనే మంకీ రెస్క్యూ సెంటర్ ఉండటంతో అక్కడి దూర ప్రాంతాల నుంచి కోతులను తీసుకెళ్లడం ఆర్థికంగా భారమవుతోంది. ములుగు, భూపాలపల్లి, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో భారీగా అడవులతో పాటు కోతులు ఉన్నాయి.

వరంగల్‌లో మంకీ రెస్క్యూ, రిహాబిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే.. కోతుల్లో సంతానోత్పత్తి తగ్గించేందుకు స్టెరిలైజేషన్ చేసే అవకాశం ఉంటుందనే అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేంద్రంలో ప్రతీ నెల కనీసం 500ల నుంచి 600 కోతులకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేసే అవకాశం ఉంది. దీంతో చాలా వరకు కోతుల సంతానోత్పత్తిని తగ్గించవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే మంకీ ఫుడ్ కోర్టులను కూడా విరివిగా పెంచి, అడవుల్లోనే వాటికి ఆహారం, ఆశ్రయం లభించేలా ప్రభుత్వం అటవీశాఖతో కలిసి ప్రణాళిక రూపొందించాలని కోరుతున్నారు.

లోకల్ ఎన్నికల్లో కోతులే ప్రధాన ఎజెండా?

కోతుల సమస్యను ప్రజలు చాలా సీరియస్‌గా తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే, ఎంపీలు, అధికారులు ఎవరు ఊరికి వెళ్లిన కోతుల సమస్యనే ప్రధానంగా ఏకరువుపెడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాలకుర్తి, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కోతుల సమస్యనే ప్రధాన అంశంగా ప్రస్తావించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కోతల ఎజెండాను ప్రజలు తెరపైకి తెస్తున్నారు. 2019లో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో కోతులు బెడద తీవ్రంగా ఉండేది. సర్పంచ్ ఎన్నికల ముందు గ్రామంలోని ఆర్టీసీ డ్రైవర్ దుడల సంపత్ కోతుల సమస్యను పరిష్కరించారు. ఆ తర్వాత ఆయన తన భార్య ప్రమీలను పోటీలో పెట్టగా.. ఆమెను గ్రామస్థులు 300ఓట్లకు పైగా మెజార్టీతో గెలిపించారు. సంపత్ ఉదాంతాన్నే ఉదాహరణగా తీసుకుని వచ్చే లోకల్ బాడీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తిఉన్నవారిని కోతుల సమస్యల పరిష్కరించాలనే దిశగా ప్రజల నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో జరిగిన ఘటనల్లో కొన్ని..

గతేడాది ఫిబ్రవరిలో మహబూబాబాద్ జిల్లా చిన్నగూడురు మండలం ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన అంగోతు సిరి(65), కిరణ్(35) పంట పొలాలకు కోతులు రాకుండా రక్షణగా విద్యుత్ తీగలు పెట్టారు. ప్రమాదవశాత్తు రక్షణ తీగలకే తగిలి విద్యుత్ షాక్‌తో తండ్రీకొడుకులు మృతి చెందారు. ఇక ఈ ఏడాది ఫిబ్రవరి 18వ తేదీన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం మడిపల్లి గ్రామానికి చెందిన బానోతు వెంకన్న తన వ్యవసాయ భూమిలో వేసిన మొక్కజొన్నను కోతుల బెడద నుంచి కాపాడేందుకు తన భార్య సునితతో కలిసి చెను వద్దకు వెళ్లారు. కోతుల గుంపును చెను నుంచి బయటకు తరుముతున్న క్రమంలో కాలుజారి ప్రమాదవశత్తు బావిలో పడి వెంకన్న మృతి చెందాడు. ఫిబ్రవరి 12న పెద్దవంగర మండల కేంద్రంలో కోతుల బెడద నుంచి మొక్కజొన్నకు రక్షణ కల్పించేందుకు రైతులు విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. ఇది గమనించకుండా వెళ్లిన గీతకార్మికుడు అనపురం వెంకన్న విద్యుత్ తీగకు తగిలి షాక్‌గురై మృతి చెందారు. ఫిబ్రవరి 18వ తేదీన వరంగల్ నగరంలోని 34వ డివిజన్‌లో పారిశుద్య కార్మికురాలు గన్నారాపు తేజపై కోతులు దాడి చేయగా, పరుగెత్తే క్రమంలో కింద పడటంతో తీవ్ర గాయాలతో పాటు ఎడమ చెయ్యి విరిగింది. వీటితో పాటు చిట్యాల మండలంలో ఒడితల, గోపాలపురంలో 25మందికి పైగా కోతులు దాడి చేశాయి. కొడకండ్ల మండలంలో బీసీ హాస్టల్ స్వీపర్ ఉమపై, ఐనవోలు మండలం కేంద్రానికి చెందిన అగపాటి వెంకటలక్ష్మిపై కోతులు దాడి చేసి గాయపరిచాయి. గోవిందరావుపేట, ఏటూరునాగారం, మంగపేట, కేసముద్రం మండలాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది.



పంట నుంచి కోతులను తరిమే క్రమంలో బావిలో పడి మృతి చెందిన వెంకన్న (ఫైల్)




గారెపల్లిలో ఇటీవల కోతుల దాడిలో గాయపడిన చిన్నారి ఎస్‌కే నిహద్



కోతుల దాడిలో గాయపడిన ఉమ

'దేవాదుల'లో మరో మోటారు ఆన్

కన్నాయిగూడెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుపాకులగూడెం గ్రామ పంచాయతీ పరిధి గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులో ఫేజ్ 3 నుంచి రెండు మోటార్లతను ఇంజినీరింగ్ అధికారులు ఆదివారం ఆన్ చేశారు. దేవాదుల పంప్‌హౌస్‌లోని ఫేజ్ 3లో విద్యుత్ స్విచ్ గేరు వద్ద పీటీఆర్‌కు మరమ్మతుల కారణంగా ఫిబ్రవరి 24న నాలుగు మోటార్లను అధికారులు ఆఫ్ చయేశారు. శుక్రవారం రాత్రి వరకు ఫేజ్ 2లోని ఒక మోటారు ద్వారా 247 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేశారు. శనివారం ఉదయం ఫేజ్ 2లో ఒకటి, ఫేజ్ 3లో ఒక మోటారును ఆన్ చేశారు. తిరిగి ఇదే రోజు రాత్రి ఫేజ్ 3 లో మరొక మోటారును ఆన్ చేశారు. శనివారం రాత్రి వరకు ఫేజ్ 2లో రెండు మోటార్లు, ఫేజ్ 3లో రెండు మోటార్లు.. మొత్తం నాలుగు మోటార్ల ద్వారా నీటిని ఎత్తి పోశారు. ఆదివారం ఉదయం ఫేజ్ 3లోని మరో మోటారును, సాయంత్రం మరో మోటారును ఆన్ చేశారు. ఫేజ్ 2లో ఒక మోటారు లీకేజీ కారణంగా నిలిపి వేసి మొత్తం ఫేజ్ 2లోని ఒక మోటారు, ఫేజ్ 3లోని నాలుగు మోటార్ల ద్వారా మొత్తం ఐదు మోటార్ల ద్వారా 1417 క్యూసెక్కుల నీటిని భీంఘనపూర్ రిజర్వాయర్‌కు ఎత్తి పోస్తున్నారు. ఇదిలా ఉండగా తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువ నుంచి 2,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో ప్రాజెక్టు లోని ఒక గేటును ఎత్తి దిగువకు 750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 6.94 టీఎమ్సీలు కాగా ప్రస్తుతం 3.38 టీఎమ్సీల నీళ్లు నిల్వ ఉన్నాయి. ప్రాజెక్టు నిర్మాణంలో పూర్తి స్థాయి నీటిమట్టం నిల్వ చేస్తే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కొంత భూభాగం ముంపునకు గురవుతుందని అక్కడి ప్రభుత్వం నుంచి ఎన్‌వోసీ రాక పోవడంతో బ్యారేజీలో పూర్తి స్థాయి నీళ్లు నిల్వ చేయటం లేదు. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 78.70 మీటర్లు నీటిమట్టం నమోదు కాగా సమ్మక్క సాగర్ వద్ద 78.90 మీటర్ల నీటిమట్టం రికార్డు అయ్యిందని సీఏడీ డీఈఈ శరత్ బాబు తెలిపారు


సమ్మక్క సాగర్ బ్యారేజీలో నిల్వ ఉన్న నీళ్లు

కీలక మైలురాయి దాటాం


ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గేట్‌ను తొలగించి పరిసరాలను శుభ్రం చేయిస్తున్న పోలీసులు

- మావోయిస్టు రహిత జిల్లాగా ములుగు
- ఏటూరునాగారంలో 25 ఏళ్లనాటి గేట్‌ను తొలగించడమే నిదర్శనం
- వెల్లడించిన ఎస్పీ శబరీశ్



ములుగు కలెక్టరేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ములుగును మావోయిస్టు రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోందని ఎస్పీ శబరీశ్ తెలిపారు. ఇందుకు ఇప్పటికే అనేక మైలురాళ్లు దాటగా ప్రశాంత వాతరణంలో అడుగు పెడుతు న్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ఏటూరునాగారం పోలీస్ స్టేషన్ ఎదురుగా సుమారు 25 ఏళ్లుగా 163వ జాతీయ రహదారికి అడ్డుగా ఉన్న గేట్‌ను తొలగించి సామాన్య ప్రజలకు దారి సుగమం చేశామని తెలిపారు. శాంతిభద్రతలు సురక్షితంగా ఉన్నాయనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. 2001లో ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న అప్పటి రహ దారి వెంట ప్రజల వాహనాల రాకపోకలు జరుగుతుం డేవని, రెక్కీ చేసిన అప్పటి పీపుల్స్‌వార్ గ్రూప్ నక్సల్స్ రెండు ట్రాక్ట ర్లలో డైరెక్షన్‌మైన్స్ అమర్చి పోలీస్‌స్టేషన్‌ను పేల్చివేసే ప్రయ త్నం చేశారని గుర్తు చేశారు. ఈఘటనలో ఒక సాధారణ పౌరు డితోపాటు ఒక ఫారెస్టు అధికారి, ముగ్గురు పోలీసులు మర ణించారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి నుంచి ఏటూ రునాగారం పోలీసులు మావోయిస్టుల దాడులు పునరావృతం కాకుండా 163వ జాతీయ రహదారి మూసివేశారని తెలిపారు. వాహనాల రాకపోకలను ఐటీడీఏ పీవో గెస్ట్‌హౌస్ వెనుక వైపు నుంచి ఏటూరునాగారం వైపు మళ్లించినట్టు పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలో జరిగిన వరుస పోలీస్ ఎదురుకాల్పుల్లో సీపీఐ మావోయిస్టు ముఖ్య నాయకులతోపాటు జేఎండబ్ల్యూపీ డివిజ నల్ కమిటీకి చెందిన ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ ఏరియా కమిటీకి చెందిన దళం, ఇల్లెందు-నర్సంపేట దళం పూర్తిగా తెలంగాణలో అంత రించిపోయాయని ఎస్పీ తెలిపారు. అంతే కాకుండా ములుగు పోలీసులు మావోయిస్టుల కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి సభ్యుల లొంగుబాటు కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామని, దీంతో పెద్దఎత్తున మావోయిస్టు సభ్యులు, నేతలు లొంగిపోయారని వివరించారు. మావో యిస్టు కార్యకలాపాల కట్టడికి ములుగు జిల్లా పోలీసులు అనేక చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో మావోయిస్టు పార్టీ కదలికలు పూర్తిగా అంతరించిపోయిన నేపథ్యంలో సామాన్య ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని 25ఏళ్ల తర్వాత ఏటూరునాగారం పోలీసులు జాతీయ రహదారికి అడ్డుగా ఉన్న గేట్‌ను తెరిచి ప్రజల వాహ న రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పునఃప్రారం భించి నట్టు ఎస్పీ తెలిపారు. మావోయిస్టు రహిత జిల్లాగా ములు గును మార్చడం కోసం పోలీస్‌శాఖ అహర్నిషలు కృషిచే స్తోం దని, ప్రజల రక్షణే ధ్యేయంగా శాంతిభద్రతల అదుపులో ములు గు పోలీస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని వివరించారు.

వాలీబాల్ విజేత ములుగు జట్టు


ములుగు జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు

వరంగల్ స్పోర్ట్స్, మార్చి2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ములుగు జట్టు ప్రథమ స్థానంలో నిలువగా, ద్వితీయ స్థానంలో కేయూ ఫిజికల్ ఎడ్యూకేషన్ జట్టు విజయం సాధించాయి. రెండు రోజులుగా హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని వాలీబాల్ కోర్టులో ఎంవీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివంగత మూల వెంకట్‌రెడ్డి స్మారకార్థం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నీ ఆదివారం ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు తెలంగాణ యూనివర్సిటీ (వీసీ)యాదగిరిరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకున్నప్పుడే రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఎంవీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించి, క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఎంవీఎంఆర్ ఫౌండేషన్ సభ్యులు, క్రీడా పోటీల నిర్వహకుడు, ఏసీపీ (సీఎస్‌బీ) మూల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ తన సోదరుడు దివంగత వెంకట్‌రెడ్డికి క్రీడల పట్ల ఉన్న తమ ఆసక్తితో తమ కుటుంబ సభ్యుల సహకారంతో ఇటీవల ఎంవీఎంఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు.

రెండు రోజులు పాటు నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నీలో 22 జట్లు పాల్గొనడం జరిగిందన్నారు. హోరాహోరీగా జరిగిన వాలీ బాల్ సమరంలో ప్రథమ స్థానంలో ప్రభు త్వం డిగ్రీ కళాశాల ములుగు, ద్వితీయ స్థానంలో ఫిజికల్ ఎడ్యూకేషన్ కాకతీయ యూనివర్సిటీ జట్టు, తృతీయ స్థానంలో జనగాం, చతుర్థ స్థానంలో కామారం జట్లు విజేతలుగా నిలిచాయన్నారు. కాగా, ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 20 వేలు, ద్వితీయ స్థానం లో రూ. 15వేలు, తృతీయ స్థానంలో రూ. 10 వేలు, చతుర్థ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 5వేల నగదు పుర స్కారంతో పాటు బహుమ తులను ప్రదానం చేసినట్టు తెలిపారు. లీగ్ నౌకౌట్ పద్ధతిన నిర్వహించిన ఈ టోర్నీలో 4 జట్లు సెమీస్‌కు చేరుకోవడంతో జట్ల మధ్య నువ్వా నేనా అనే విధంగా పోరు ఉత్కంఠ భరితంగా కొనసాగింది. దీంతో క్రీడా పోటీలను తిలకించడానికి వాలీ బాల్ కోర్టుకు పెద్ద ఎత్తున ప్రేక్షలు, అభిమానులు తరలిరావడంతో ఆ ప్రాంతం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగయ్య, డీఎస్పీ (ఇంటలీజెన్స్) నరేష్‌రెడ్డి, డీఎస్పీ (ఎస్బీ) వెంకటేష్, పీడీ బొబ్బిలి వెంక ట్‌రెడ్డి, నేతాజి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పిండి విజయ్‌కుమార్, కార్యనిర్వహణ అధ్యక్షుడు మర్రి ఇంద్రాసేనారెడ్డి, సభ్యులు, సీనియర్ వాలీ బాల్ క్రీడాకారుడు మర్కాల యాదిరెడ్డి, డీఎస్‌ఏ వాలీబాల్ కోచ్ జీవన్‌గౌడ్ పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు

గోవిందరావుపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పస్రా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సై కమలాకర్ ఆదివారం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు మద్యంసేవించి వాహనం నడుపరాదని, ర్యాష్ అండ్ నెగ్లిజెన్సీ డ్రైవింగ్ చేయరాదని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, త్రిబుల్ రైడింగ్ చేయరాదని, వాహనాల్లో పరిమితికి మించి ప్రజలను తీసుకెళ్లకూడదని అన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రామప్పలో పర్యాటకుల సందడి


రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న పర్యాటకులు

వెంకటాపూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రపంచ ప్రసిద్ధ రామప్ప దేవాలయంలో పర్యాటకులు, విద్యార్థుల సందడి నెలకొంది. ఆదివారం సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు, పాఠశాలల విద్యార్థులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ముందుగా వారు క్యూలైన్‌లో రామలింగేశ్వరస్వామిని దర్శించుకోగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా పర్యాటకులు, విద్యార్థులు నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆలయ శిల్ప కళా సౌందర్యాన్ని కనులారా వీక్షించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్‌లను అడిగి తెలుసుకుని ఆనందం వ్యక్తంచేశారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

సైక్లింగ్‌తో శారీరక దృఢత్వం

అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్


సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న బాదం ప్రవీణ్

ములుగు కలెక్టరేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సైక్లింగ్‌తో శారీరక దృఢత్వం పెంపొందుతుందని సైక్లింగ్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ అన్నారు. సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ములుగులో జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు జరుగనున్నాయని, అందులో భాగంగానే జిల్లా స్థాయి పోటీలు నిర్వహించడం జరిగిందని అన్నారు. జిల్లా నుంచి 50 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని, అందులో 24 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశామని తెలిపారు.

మొక్కజొన్న రైతులకు న్యాయం చేయాలి

వెంకటాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బాండ్ కంపెనీ మొక్కజొన్న పంట సాగుచేసి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని బహుజన సమాజ్‌వాది పార్టీ మండల అధ్యక్షుడు గణేష్‌చారి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండలంలోని బర్లగూడెం పంచాయతీ పరిధిలో నష్టపోయిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా రైతు లతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు పం డించిన పంటకు సరైన గిట్టుబాటు ధర రాక నష్టపోయారని, వారికి న్యాయం జరిగేవరకు బీఎస్పీ అండగా ఉంటుందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లె సతీష్, వేల్పుల బాబూరావు, రైతులు పాల్గొన్నారు.

మిర్చి పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పండించిన మిర్చి పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్డీ.అమ్జద్‌పాషా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సంఘం నాయకులతో కలిసి ములుగు మండలంలోని కాసిందేవిపేట, దేవగిరి పట్నం గ్రామాల్లోని మిర్చి కల్లాలను సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 25వేల ఎకరాల్లో రైతులు మిర్చిపంట సాగుచేశారని, పెట్టిన పెట్టుబడి రాక గిట్టుబాటు ధర లేక రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈవిషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మిర్చిపంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే రైతాంగాన్ని పెద్దసంఖ్యలో సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట భాస్కర్, నరసింహారావు, గొర్రెకుంట శ్రీకాంత్, కట్ల నరేష్, ప్రభాకర్, మహేందర్, మల్లేష్, చాంద్‌పాషా, మొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

జాకారం గురుకులంలో సైన్స్ దినోత్సవం

ఎగ్జిబిట్లను సందర్శించిన ప్రొఫెసర్లు


విద్యార్థుల ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ప్రొఫెసర్లు

ములుగు కలెక్టరేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో ఆదివారం సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రొఫెసర్లు రవీందర్, కిషన్, రాజు విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ఎగ్జిబిట్లను పరిశీలించి ప్రతిభ కనబరిచినవారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ పిచ్చిరెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు సురేష్‌బాబు, రాంరెడ్డి, యాదగిరి, రామచంద్రం, వెంకటరెడ్డి, బ్రహ్మచారి, సదయ్య, రజిని, మమత, దయానంద్, పుల్లయ్య, ముఖేష్, చంద్రమౌళి, రాములు పాల్గొన్నారు.

శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


శ్రీపాదరావుకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

టేకుమట్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మాజీ స్పీకర్, దివంగ నేత దుద్దిళ్ల శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని రాఘవరెడ్డిపేటలో కాంగ్రెస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శ్రీపాదరావు జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారయణరావు హాజరై శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కేకు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, జిల్లా, మండల నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- భూపాలపల్లిటౌన్(ఆంధ్రజ్యోతి): మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను భూపాలపల్లిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు ఆధ్వర్యంలో జరుగగా నాయకులు క్యాతరాజు సాంబమూర్తి, తిరుపతిగౌడ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.
- మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొయ్యూర్, ఎడ్లపల్లిలో దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బడితల రాజయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్, అయిత రాజిరెడ్డి, గడ్డం క్రాంతి, మండల రాహుల్, కొండ రాజమ్మ, జంగిడి సమ్మయ్య, కేశారపు చంద్రయ్య, సవేందర్ పాల్గొన్నారు.
- మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలో దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ మండల అధ్య క్షుడు ఎం.డి.అక్బర్‌ఖాన్ ఆధ్వర్యంలో శ్రీపాదరావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎస్సీ సెల్ నాయకుడు లేతకారి రమ్య రాజబాబు ఆధ్వర్యంలో కాళేశ్వరం శ్రీపాద విగ్రహం దగ్గర అన్నదాన కార్యక్రమం జరిగింది.
- కాటారం (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు మండలంలో ఘనంగా జరి గాయి. అటవీశాఖ రేంజ్ కాంప్లెక్స్‌లో డిప్యూటీ రేంజర్లు సురేందర్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధన్వాడలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇంట్లోని శ్రీపాదరావు విగ్రహానికి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీటూరి మహేష్ ఆధ్వర్యంలో గ్రామపెద్దలు, కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షు డు ప్రభాకర్‌రెడ్డి, యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు చింతకాని క్రాస్ వద్ద శ్రీపాదరావు విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బస్వాపూర్‌లో శ్రీపాదరావు విగ్రహానికి యూత్ కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ సమ్మయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆంగోత్ సుగుణ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వంశవర్ధన్‌రావు, నాయకులు దేవేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, స్వామి, నాయిని శ్రీనివాస్, అజీజ్, రఘురాం, అశోక్, విజయరాజు, లచ్చిరెడ్డి, శ్రీహరి, రాజేషం, రమేష్‌రెడ్డి, రాజు, శకుంతల, సమ్మిరెడ్డి, భాస్కర్, రవి, విక్రమ్, మొగిలి, బాపు, వెంకటస్వామి, దాదామియా, ఉంసింగ్, అమీర్, విక్రమ్, దేవేందర్, ఉమాశంకర్, కిరణ్, ప్రభుదాస్, ప్రభాకర్, దేవేందర్, మహేందర్, నరేష్‌కుమార్ రమేష్ తదిరులు పాల్గొన్నారు.

మహిళల్లో ప్రతిభను వెలికి తీసేందుకే క్రీడా పోటీలు


మాట్లాడుతున్న క్యాతరాజు సతీష్

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మహి ళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడుతున్న తరుణంలో వారిలో ఉన్న ప్రతిభ ను వెలికి తీసేందుకు క్రీడా పోటీ లు నిర్వహించినట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, 24వ వార్డు ఇన్‌చార్జి క్యాతరాజు సతీష్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సింగరేణి పాఠశాలలో సీపీఐ 25వ వార్డు శాఖ సమితి ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించగా ఏఐటీయూసీ బ్రాంచి అసిస్టెంట్ సెక్రటరీ గంగాసారపు శ్రీనివాస్‌తో కలిసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలే కాకుండా వివిధ కార్యక్రమాలు ప్రతీ యేటా నిర్వహిస్తున్నట్టు అన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బహుమతులు అందిస్తామన్నారు. ఈ కర్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్, జిల్లా సమితి సభ్యులు శీకాంత్, జోసెఫ్, పోషం, సింహాద్రి, కృష్ణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి

తాడ్వాయి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో వెల్లడించారు. అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే సూచించన ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ములుగు అగ్ని మాపక కేంద్రం ఫోన్ నెంబర్ 8712699211, జిల్లా అగ్ని మాపక అధికారి నెంబర్ 8712699210, తాడ్వాయి పోలీస్ స్టేషన్ నెంబర్ 8712670088, ఇంకా 100 నెంబర్‌కు ఫోన్ చేయొచ్చని సూచించారు.

ముస్లింల ఉపవాస దీక్షలు ప్రారంభం


జామ మసీద్‌లో ఇఫ్తార్ చేస్తున్న ముస్లింలు

భూపాలపల్లిటౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం ప్రారంభమైంది. శనివారం రాత్రి నెలవంక కనిపించడంతో ఆదివా రం నుంచి ముస్లింలు ఉపవాస దీక్షలు పాటిస్తున్నారు. దీంతో పట్టణంలోని మసీదులన్నీ కిటకిటలాడుతున్నాయి. ప్రార్థనలతో మార్మోగాయి. సాయంత్రం ముస్లింలు మొదటి రోజా (ఉపవాసం)ను (ఇఫ్తార్) విరమించారు.

బైక్‌ను ఢీకొన్న కారు

ఒకరికి తీవ్ర గాయాలు

ఏటూరునాగారం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలం చిన్నబోయినపల్లి వద్ద బైక్‌ను కారు ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. హనుమకొండకు కొందరు కారులో ఆదివారం మంగపేట మండలం మల్లూరులోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లారు. తిరిగి వెళ్తుండగా మండలంలోని చిన్నబోయినపల్లి బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతున్న బైక్‌ను కారు ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని ఏటూరునాగారం మండల కేంద్రంలోని సామాజిక ప్రభుత్వ ఆస్పత్రికి స్థానికులు తరలించారు.

యువకుడికి తీవ్రగాయాలు

బైక్‌ను లారీ ఢీకొనడంతో ప్రమాదం

కాటారం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం శివారులో కాటారం-మంథని రహదారిపై ఆదివారం రాత్రి బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమా దంలో రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన ఆకుదారి రమేష్ అనే యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ బైక్‌పై మండలకేంద్రానికి వచ్చి ఇంటికి వెళ్తున్నాడు. పెట్రోల్ పంప్ సమీపంలో యూ టర్న్ తీసుకుంటుండగా కొయ్యూరు వైపు నుంచి భూపాలపల్లి వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో రమేష్ ఎగిరి రోడ్డుపై పడ్డాడు. లారీ కింద బైక్ పడటంతో నుజ్జునుజ్జు అయ్యింది. స్థానికులు గమనించి పోలీసులు, 108అంబులెన్స్‌కు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో భూపాలపల్లి 100పడకల ఆస్పత్రికి తరలించారు.


నుజ్జునుజ్జు అయిన బైక్.. గాయపడిన యువకుడు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


మొగుళ్లపల్లి పాఠశాలలో పూర్వవిద్యార్థులు

మొగుళ్లపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07లో పదోతరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలకు చేరుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనుభవాలను పంచుకున్నారు. చదువు చెప్పిన గురువులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు సామూహిక భోజనాలు చేసి ఆనందంగా గడిపారు.